క్లుప్తంగా

'రేవంత్‌పై దాడి హేయమైన చర్య'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

జన్నారం: భూపాలపల్లి జిల్లాలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై దాడి చేయడం హేయమైన చర్య అని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడమ బొజ్జు అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికార పార్టీకి చెందిన కొందరు అల్లరి మూకలతో కక్ష్యపూరితంగా కోడిగుడ్లతో కొట్టి అవమానపరిచారని ఆరోపించారు. పోలీసులు దుండగులను గుర్తించి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ప్రభుదాస్, ప్రధాన కార్యదర్శి ఫసీవుల్లా, నాయకులు కరుణాకర్, ఇందయ్య, తిరుపతి, గంగన్న, హాజర్ పాల్గొన్నారు.

తిలక్‌నగర్‌లో కాంగ్రెస్ జోడో యాత్ర

రామకృష్ణాపూర్: పట్టణంలోని తిలక్‌నగర్‌లో బుధవారం కాంగ్రెస్ పార్టీ హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను గడపగడపకూ వివరించారు. కాంగ్రెస్ ద్వారానే అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. పీసీసీ సభ్యుడు నూకల రమేష్, పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, తేజావత్ రాంబాబు, పల్లె రాజు, నోముల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రీతి మృతి కారకులను శిక్షించాలి

మంచిర్యాలటౌన్: వరంగల్‌లో విద్యనభ్యసిస్తున్న గిరిజన మెడికల్ విద్యార్థిని ప్రీతి ఆత్మహత్య చేసుకునేందుకు కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలని జై భారత్ స్టేట్ కౌన్సిల్ సభ్యులు ఎంఏ సలీం, జోయెల్, జ్వాలా మహిళా సంస్థ సభ్యురాలు సెల్వరాణి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉన్నత ఆశయాలతో పట్టుదలతో చదివి వైద్యరంగంను ఎన్నుకుని, సేవలు అందిస్తున్న తరుణంలో సీనియర్ విద్యార్థి సైఫ్ మానసిక హింసకు గురి చేయడంతో ఆమె మృతికి కారణంగా తెలుస్తుందని, ప్రిన్సిపాల్, హెచ్‌వోడీని సస్పెండ్ చేసి, నిందితుడు సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పోచమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భీమారం: మండలంలోని అంకుసాపూర్‌లో నాయకపోడ్ గిరిజనులు నిర్మించే పోచమ్మ ఆలయ నిర్మాణ పనులకు బుధవారం సర్పంచ్ దర్శనాల రమేశ్‌తో పాటు గిరిజనులు భూమిపూజ చేశారు. తమ కుల ఆరాధ్యదైవమైన పోచమ్మ దేవాలయం నిర్మించేందుకు అందరూ ఐక్యంగా ఉండి, నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సర్పంచ్ రమేశ్ తనవంతు విరాళంగా రూ.50,000 నగదు గిరిజనులకు అందజేశారు.

బ్రహ్మకుమారీస్ భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న కుల్దీప్ దీదీ

మంచిర్యాలఅర్బన్: స్థానిక హైటెక్‌సిటీలో హైదరాబాద్ శాంతి సరోవర్ నుంచి వచ్చిన బీకే కుల్దీప్ దీదీ జీ చేతుల మీదుగా బుధవారం ఈశ్వరీయ బ్రహ్మకుమారి భవనం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ మంగీలాల్ సోమాని, వార్డు కౌన్సిలర్ చైతన్యరెడ్డి, నడిపెల్లి చారిట్రబుల్ ట్రస్టు చైర్మన్ విజిత్‌రావు, బ్రహ్మకుమారీలు హేమలత, రమ, వివిధ సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో సమావేశం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం బీజేవైఎం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివకృష్ణ మాట్లాడారు. కళాశాలలో ర్యాగింగ్‌లకు తావివ్వవద్దని, ఎలాంటి సమస్య వచ్చినా ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు కొటారి వెంకటేశ్, మండల జనరల్ సెక్రటరీ ప్రవీణ్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం



ఘనంగా రేణుక ఎల్లమ్మ కల్యాణం

మంచిర్యాలఅర్బన్: స్థానిక హమాలీవాడ పోచమ్మ చెరువు సమీపంలో రేణుక ఎల్లమ్మ ఆలయంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవంలో భాగంగా చివరి రోజు బుధవారం రేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం కనుల పండువగా సాగింది. వేదమంత్రోచ్చరణల మధ్య జరిగిన రేణుక ఎల్లమ్మ కల్యాణాన్ని భక్తులు చూసి తరించిపోయారు. అనంతరం అన్నసంతార్పణం చేపట్టారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కల్యాణ మహోత్సవానికి బెల్లంపల్లి ఎమ్మెల్యే చిన్నయ్య, మున్సిపల్ చైర్మన్ పెంటరాజయ్య, గౌడ సంఘం సభ్యులు రాజేశ్‌గౌడ్, చంద్రమోహన్‌గౌడ్, పండరీగౌడ్, రాజాగౌడ్, మధుకర్, జీవన్‌గౌడ్, పలువురు కౌన్సిలర్లు హాజరయ్యారు.



మురుగు కాలువలో పూడికతీత

సాక్షి ఎఫెక్ట్..

బెల్లంపల్లి: పుర సమస్యలపై 'సాక్షి' దినపత్రిక మున్సిపల్ కమిషనర్‌తో ఈ నెల 27న బెల్లంపల్లి మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ఆకుల వెంకటేష్‌తో ఫోన్–ఇన్ నిర్వహించగా మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపాలిటీలోని 18వ వార్డు కాంట్రాక్టర్ బస్తీకి చెందిన గర్రెపల్లి నాగరాజు, తొటం సౌమ్య ఫోన్‌చేసి తమ వీధిలోని మురికినీటి కాలువలో పూడిక నిండి దుర్వాసన వస్తున్నట్లు కమిషనర్‌తో విన్నవించారు. ఈ మేరకు స్పందించిన కమిషనర్ రెండు రోజుల్లో పూడిక తీత పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ పారిశుధ్య సిబ్బందిని సదరు వార్డుకు పంపించి పూడిక తీయించి, ఫోన్‌ఇన్‌లో ఇచ్చిన హామీని నెరవేర్చారు. సత్వరంగా స్పందించి సమస్య పరిష్కరించడానికి చర్యలు తీసుకున్న ఇన్‌చార్జి కమిషనర్ వెంకటేష్‌ను, ఫోన్ ఇన్ నిర్వహించి సమస్య పరిష్కారానికి మార్గం చూపించిన 'సాక్షి'ని స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



కాంట్రాక్టర్ బస్తీలో మురికి కాలువలో పూడిక తీస్తున్న సిబ్బంది



విస్తరించారు.. పచ్చదనం మరిచారు!

దండేపల్లి: గూడెం–మేదరిపేట రింగ్ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించి సుమారు ఐదేళ్లు అవుతోంది. గతంలో ఉన్న సింగిల్ రోడ్డు రహదారికి రెండు వైపులా పెద్ద, పెద్ద చెట్లు ఉండేది. విస్తరణలో భాగంగా చెట్లను తొలగించారు. గతంలో చెట్లు ఉండటంతో రహదారి వెంట కళకళలాడుతూ, కనిపించిన పచ్చదనం ఇప్పుడు కనుమరుగైంది. ఎక్కడో ఒక్కచోట మాత్రమే చెట్లు కనిపిస్తున్నాయి, తప్పా రహదారి చాలా చోట్ల మోడువారే దర్శనమిస్తోంది. రహదారి పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి. గతంలో హరితహారంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా నామమాత్రంగా కొన్నిచోట్ల మొక్కలు నాటారు. అందులో కొన్ని మొక్కలు చనిపోగా, కొన్ని మాత్రమే బతికున్నాయి. రోడ్డుకు ఇరువైపులా స్థలం ఉన్నా ఇప్పటికి మొక్కలు నాటలేదు. గతంలో మాదిరిగా రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి, సంరక్షించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.



నరికేసిన చెట్ల ఆనవాళ్లు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



తాండూర్: వంటవాళ్లకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే

తాండూర్: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సూచించారు. మండలంలోని మహాత్మా జ్యోతి బా పూలే బాలుర గురుకుల పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల కోసం వండిన భోజనం పరిశీలించి, కుక్‌తో మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు మెరుగైన విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. గురుకులంలో వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

'ఇళ్ల పట్టాలు ఇప్పిస్తాం'

బెల్లంపల్లి: అర్హత కలిగిన ప్రతి ఇంటికీ ఇళ్ల పట్టాలు ఇప్పిస్తామని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మున్సిపాలిటీలోని 1, 14, 15వార్డుల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల ప్రజలకు ఇళ్ల పట్టాల గురించి అవగాహన కల్పించారు. స్థానికుల అనుమానాలను నివృత్తి చేశారు. పురప్రజలు తనకు, బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, మున్సిపల్ కౌన్సిలర్లు సూరం సంగీత, బొడ్డు నారాయణ, రమేష్, కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి వెంకటేష్, బీఆర్‌ఎస్ శ్రేణులు, ఆయా వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎంపీ పరామర్శ

జన్నారం: మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన దాసరి తరుణ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని బుధవారం మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఆత్మహత్యకు పాల్పడిన గూడెం గ్రామానికి చెందిన హర్ష కుటుంబాన్ని కూడా ఆయన పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రి నాయక్, మండల అధ్యక్షుడు గోలి చందు, నాయకులు మహేష్, సూర్య, ఇంద్రయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న మాజీ ఎంపీ

క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు ప్రదానం

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధి ఏఎంసీ క్రీడా మైదానంలో జరిగిన క్రికెట్ పోటీల్లో విజేతలకు బుధవారం బహుమతి ప్రదానం చేశారు. తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–19 విభాగంలో యువకులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ టోర్నమెంట్ పోటీల్లో రైల్వేస్టేషన్ టీమ్ విన్నర్స్‌గా నిలవగా, గ్రౌండ్ టీమ్ రన్నర్స్‌గా నిలిచింది. ఇరుజట్ల కెప్టెన్లు లోకేష్, చందుకు బెల్లంపల్లి మండలం చాకేపల్లి గ్రామ ఎంపీటీసీ ముడిమడుగుల మహేందర్ బహుమతి అందజేశారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, యువజన కాంగ్రెస్ నాయకులు శ్రావణ్, అమన్, శ్రీనాథ్, సురేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.



విజేతలకు షీల్డ్ అందిస్తున్న ఎంపీటీసీ మహేందర్

విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలి

బెల్లంపల్లి: రాష్ట్రంలో ఉన్న కార్పొరేట్ కళాశాలలకు రాష్ట్ర ప్రభుత్వం అమ్ముడుపోయి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కృష్ణ దేవరాయలు ఒక ప్రకటనలో విమర్శించారు. నార్సింగిలోని ఓ కార్పొరేట్ కళాశాలలో సాత్విక్ అనే విద్యార్థిపై ప్రిన్సిపాల్ పెట్టిన వేధింపులకు తాళలేక ఆ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నట్లు ఆరోపించారు. వెంటనే ఆ కళాశాలను సీజ్ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుని, విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునఃరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

'ఏఐటీయూసీ ద్వారానే కార్మికుల హక్కుల సాధన'

రామకృష్ణాపూర్: ఏఐటీయూసీ ద్వారానే కాంట్రాక్ట్ కార్మికుల హక్కులు సాధించబడుతాయని యూనియన్ జిల్లా అధ్యక్షుడు అక్బర్‌అలీ అన్నారు. మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ ఓసీలో బుధవారం కాంట్రాక్ట్ కార్మికులతో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు, పనిస్థలాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎంతటి పోరాటాలకైనా సిద్ధపడే ఏఐటీయూసీకి అండగా నిలువాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఇప్పకాయల లింగయ్య, అంజనేయులు, కొమురయ్య, సతీష్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ఇంటి అద్దె చెల్లింపునకు అంగీకారం



మాట్లాడుతున్న సత్యనారాయణ

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో క్వార్టర్లు కేటాయించని ఉద్యోగులకు యాజమాన్యం ఇంటి అద్దె చెల్లించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో యాజమాన్యాన్ని నిలదీయగా ఏరియా జీఎం చొరువతో అంగీకరించిందని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. ఏరియాలోని కేకే–5 గని వద్ద బుధవారం కార్మికులను కలిసి విషయాన్ని వివరించారు. ఇంటి అద్దె చెల్లింపునకు అంగీకరించిన జీఎంకు ఉద్యోగుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల అండతో చేసిన ఆందోళన ఫలితంగానే విజయం సాధించామని అన్నారు. ఆయన వెంట నాయకులు సుదర్శన్, తిరుపతి, శ్రీనివాస్ ఉన్నారు.

పదవీ విరమణ పొందిన కార్మికులకు సన్మానం

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియా ఆర్‌కే 7 గనిపై పదవీ విరమణ పొందిన కార్మికులను గని మేనేజర్ సాయి ప్రసాద్ బుధవారం ఘనంగా సన్మానించారు. వారికి సర్వీస్ బెనిఫిట్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో రక్షణ అధికారి రవిశంకర్, ఫిట్ సెక్రటరీ మెండె వెంకటి, ఏరియా సెక్రటరీ అశోక్, పలువురు అధికారులు, గుర్తింపు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

నస్పూర్: ఈ నెల 4, 12న శ్రీరాంపూర్‌లో నిర్వహించే సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్, రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని యూనియన్ కేంద్ర కార్యదర్శి మేకల దాసు కోరారు. ఏరియా స్టోర్స్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా, సింగరేణి సంస్థ కాంట్రాక్టు కార్మికుల శ్రమదోపిడీకి పాల్పడి వారికి అన్యాయం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో దొడ్డిపట్ల రవీందర్, అశోక్, కొమురయ్య, వేణు, తిరుపతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేకల దాసు

ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేత



నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియా ఆర్‌కే 7గనిలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ 2021లో కరోనాతో మృతి చెందిన దారా నాగేశ్వర్ రావు కుటుంబ సభ్యులకు రూ.15లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును ఆర్‌కే 7గ్రూప్ ఏజెంట్ సత్యనారాయణ, గని మేనేజర్ సాయి ప్రపసాద్ చేతుల మీదుగా బుధవారం గని వద్ద అందజేశారు. కార్యక్రమంలో ఫిట్ సెక్రటరీ మెండె వెంకటి, సంక్షేమ అధికారి శాంతన్, సిబ్బంది పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

శ్యాంసుందర్‌కు ఏరియా పీఎంగా పదోన్నతి




మందమర్రిరూరల్: మందమర్రి ఏరియా జీఎం ఆఫీస్‌లో హెచ్‌వోడీగా విధులు నిర్వర్తిస్తున్న సల్ల శ్యాంసుందర్(డీవైపీఎం)కు ఏరియా పర్సనల్ మేనేజర్‌గా బుధవారం పదోన్నతి లభించింది. మందమర్రి ఏరియాలో ఇది వరకు పర్సనల్ మేనేజర్‌గా విధులు నిర్వర్తించిన వరప్రసాద్ కొత్తగూడెం బదిలీపై వెళ్లడంతో శ్యామ్‌సుందర్ ఏరియా బాధ్యతలు చేపట్టారు. పదోన్నతి రావడంతో ఆఫీస్‌లో సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేశారు.

'కేకే–1 గని ఉద్యోగులు ఆదర్శనీయులు'

మందమర్రిరూరల్: ఏరియాలో బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనలో కేకే–1 గని ఉద్యోగులు ఆదర్శనీయులని జీఎం చింతల శ్రీనివాస్ కొనియాడారు. కేకే–1 గని గత మాసంలో వందశాతం బొగ్గు ఉత్పత్తి సాధించిన సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై జీఎం మాట్లాడారు. కేకే–1 ఉద్యోగులు అంకిత భావంతో విధులు నిర్వహించడం వల్లనే లక్ష్యం సాధించామన్నారు. గని మేనేజర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఉద్యోగులు జీఎంను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏరియా అధికారులు, గని ఉద్యోగులు ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న జీఎం దంపతులు

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియా కృష్ణాకాలనీలోని సివిల్ ఆఫీసు ఆవరణలో నూతనంగా నిర్మించిన దుర్గాదేవి ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠ చేశారు. జీఎం దంపతులు సంజీవరెడ్డి రాధాకుమారి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి హోమం కాల్చారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం దంపతులు త్యాగరాజు శ్యామల, డీజీఎం దంపతులు శివరావు పావని తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పోస్టర్ల ఆవిష్కరణ

చెన్నూర్: బెల్లంపల్లి పట్టణంలోని రెండవ గ్రౌండ్‌లో ఈ నెల 5న కవి, రచయిత గూడ అంజన్న యాదిలో సీపీఐ ప్రజాసంఘం, తెలంగాణ ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో నిర్వహించే మహాసభల పోస్టర్‌ను సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. చెన్నూర్ పట్టణ, మండల సీపీఐ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

వాహనాల తనిఖీ

జన్నారం: మండలకేంద్రంలో బుధవారం మంచిర్యాల ఎంవీఐ యోగేశ్వర్, ఎస్సై సతీశ్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీలు చేశారు. వాహన ధృవ పత్రాలు కలిగి ఉండాలని, లేకపోతే జరిమానా తప్పదని హెచ్చరించారు. పత్రాలు లేని, రోడ్డు టాక్స్ చెల్లించని వాహనాలకు జరిమానా వేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నిరుపేద కుటుంబానికి చేయూత

భీమారం: మండల కేంద్రంలోని కొత్తగూడెం కాలనీకి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన మహ్మద్ రఫీక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, అతడి భార్య గౌసీయాకి బుధవారం మహిళా వాట్సాప్ గ్రూప్ సభ్యులు రూ.6.800 అందజేశారు.

ఆర్థిక సాయం అందజేత

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలోని 31వ వార్డుకు చెందిన సత్తయ్య అనే కూలీ ఇటీవల మృతి చెందగా ఆ కుటుంబానికి బుధవారం రూ.50వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సురేశ్ బల్దువా, మాజీ కౌన్సిలర్ సత్యం, కిషన్ రావు, అనంత్, రామయ్య, రాజేందర్ రావు, వేణు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

చెన్నూర్: పట్టణంలోని గెర్రెకాలనీలో గల 838, 858, 859, 869, 866, 867, 868 సర్వే నెంబర్లలో గల అసైన్డ్, లావునీ పట్టా భూములను అక్రమంగా క్రయ విక్రయాలు జరుపుతున్నారని, ఆ భూములను స్వాధీనం చేసుకుని ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని సీపీఎం నాయకులు జిల్లా సూపరింటెండెంట్ సురేశ్‌కు వినతిపత్రం అందజేశారు.

అంబేడ్కర్ విగ్రహానికి భూమిపూజ

కాసిపేట: మండలంలోని కోమటిచేను బస్టాండ్ సమీపంలో బుధవారం అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు అంబేడ్కర్ సంఘం నాయకులు, గ్రామస్తులు భూమిపూజ చేశారు.

కార్యవర్గ ప్రమాణస్వీకారం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ప్లంబర్ అసోసియేషన్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన జిల్లా ప్లంబర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు.